క్లుప్తంగా

నేడు వినాయకుడి కల్యాణోత్సవం

సీతారామపురం : స్థానిక అమ్మవారిశాల వీధిలోని సిద్ధిబుద్ధి వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు వాసవి గణేష్ యూత్ కమిటీ శుక్రవారం తెలిపారు. ఉదయం పది గంటలకు వినాయకుడికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు కల్యాణ మహోత్సవం, రాత్రి 9 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు : పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి శుక్రవారం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 1, 2, 3, 5, 11, 15, 16, 19 వార్డులకు చెందిన కప్పల పుల్లమ్మ, దాసరి వెంకటేశ్వర్లు, గాలి బెనర్జి, షేక్ అబ్దుల్ రవూఫ్, పసుపులేటి మునిస్వామి, కరటంపాటి కృష్ణయ్య, షేక్ మస్తాన్‌బీ, ఆర్ లక్ష్మీదేవి, షేక్ మస్తాన్, షేక్ మహబున్నీసా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరమేశ్వరరెడ్డి పరామర్శించి రూ.10వేలు చొప్పున అందజేశారు.

దార్శనికుడు కామ్రేడ్ ఏచూరి



ఆత్మకూరురూరల్: నాలుగు దశాబ్దాల పాటు జాతీయ రాజకీయాల్లో రాణించిన కామ్రేడ్ సీతారాం ఏచూరి దార్శనికుడని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మోహన్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు అధ్యక్షతన ఏచూరి ప్రథమ వర్ధంతి సభను శుక్రవారం నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏచూరి సేవలను స్మరించుకున్నారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సందానీ, ఐద్వా మహిళా నాయకురాలు గుల్జార్ బేగం, ఆవాజ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు యస్దాని, నాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



ఉదయగిరి రూరల్: ఉదయగిరి ఉద్యాన శాఖ పరిధిలోని పసుపు పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఉద్యాన శాఖ అధికారిణి జయశ్రీ సూచించారు. బండగానిపల్లి రైతుసేవా కేంద్రంలో పసుపు పంట సాగుచేసిన రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువులు, పురుగుమందుల వాడకం, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. వీఏఏ వెంకటేశ్వర్లు, పసుపు రైతులు పాల్గొన్నారు.

కళాఉత్సవ్-2025 పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జలదంకి: జిల్లా స్థాయి కళాఉత్సవ్-2025 పోటీల్లో జలదంకి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్ఎం వింధ్యావళి శుక్రవారం తెలిపారు. ఇందుకూరుపేట మండలం పల్లెపాడులోని డైట్ కళాశాలలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో 3డీ కళాకృతుల నిర్మాణంలో పూర్ణిమ, కార్తీక్, ఆమని గ్రూప్ ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. గ్రూప్ సాంగ్ విభాగంలో వినీషారెడ్డి, శ్రీజ గ్రూప్ తృతీయ స్థానం, ఏకపాత్రాభినయంలో గుండాబత్తిన రితీష్ తృతీయ స్థానంలో నిలిచారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు గైడ్ ఉపాధ్యాయులను హెచ్ఎం అభినందించారు.

16న మండల సర్వసభ్య సమావేశం

జలదంకి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 16న మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జీ వెంకటరమణయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

వరిలో సస్యరక్షణ చర్యలు

సీతారామపురం : మండలంలో సాగులో ఉన్న వరి పైరును ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి శుక్రవారం పరిశీలించారు. కాండము తొలుచు పురుగును గుర్తించి నివారణకు ఎకరాకు వంద గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను పిచికారి చేయాలని సూచించారు. జింక్ లోపం ఉన్నట్లు గుర్తించి నివారణకు లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలని తెలిపారు. నత్రజని, భాస్వరం, పొటాష్‌ను తగు నిష్పత్తిలో వాడాలని సూచించారు.

- ఇరుకుగా లేన్లు..వెలగని దీపాలు
- తరచూ టోల్‌బూత్‌లను ఢీకొంటున్న వాహనాలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సిబ్బంది విధులు
- లేన్లు సరిచేయాలని కోరుతున్న వాహనచోదకులు

ప్రమాదాలకు నెలవుగా
డీసీపల్లి టోల్‌ప్లాజా

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి వద్ద నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా ప్రమాదాలకు నెలవుగా మారింది. టోల్‌ప్లాజా వద్ద లేన్లు ఇరుకుగా ఉన్నాయి. దీనికి తోడు రాత్రి వేళల్లో దీపాలు సరిగా వెలగడం లేదు. టోల్‌ప్లాజా వద్ద స్పీడ్ బ్రేకర్లు లేని కారణంగా వాహనాలు వేగంగా వస్తూ తరచూ టోల్‌బూత్‌లను ఢీకొంటున్నాయి. లేన్లను సరిచేయాల్సిన టోల్‌ప్లాజా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో టోల్‌బూత్‌ల్లో పనిచేసే సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది జూన్ 13వ తేదీ టోల్‌బూత్‌లోకి ఓ లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో లారీతో పాటు టోల్‌బూత్ పూర్తిగా దెబ్బతిన్నాయి. టోల్‌బూత్‌లో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అలాగే జూలై 1వ తేదీ చికెన్ వ్యర్థాలను తీసుకెళ్తున్న లారీ టోల్‌బూత్‌ను ఢీకొని నిలిచిపోయింది. దీంతో చికెన్‌వ్యర్థాల దుర్వాసనతో అక్కడి సిబ్బంది, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే జూలై 31వ తేదీ టోల్‌బూత్‌ను ఓ లారీ తగలడంతో ధ్వంసమైంది. టోల్‌ప్లాజాలోని లేన్లు ఇరుకుగా ఉండడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



లారీ తగలడంతో ధ్వంసమైన టోల్‌బూత్(ఫైల్)

వెలగని దీపాలు

టోల్‌ప్లాజాకు ఇరువైపులా ఉన్న దీపాలను రాత్రి వేళల్లో ఆర్పేస్తున్నారు. దీంతో టోల్‌ప్లాజాలో చీకట్లు అలుముకుని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు టోల్‌ప్లాజా సిబ్బంది దీపాలను ఆర్పేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. టోల్‌ప్లాజా వద్ద రాత్రి వేళల్లో పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతుంటారు. అదే విధంగా సమీప గ్రామాల ప్రజలు టోల్‌ప్లాజా మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి టోల్‌ప్లాజాలోని లేన్లను సరిచేసి రాత్రి వేళల్లో దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



డీసీపల్లి టోల్ ప్లాజాలో ఇరుకుగా ఉన్న లేన్లు

భూసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

వింజమూరు(ఉదయగిరి): భూసమస్యల పరిష్కారంపై రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కావలి ఆర్డీఓ వంశీకృష్ణ అన్నారు. వింజమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో భూసమస్యలపై రెవెన్యూ సిబ్బందితో ఆర్డీఓ వంశీకృష్ణ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు భూసమస్యలపై మండలం నుంచి అర్జీదారులు అధికంగా వస్తున్నారన్నారు. అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వేలో చోటుచేసుకున్న లోటుపాట్లను వెంటనే సరిదిద్దాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ

కుర్చీల వితరణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రయాణికుల సౌకర్యార్థం కుర్చీలను ధరణి సేవా సమితి ఆధ్వర్యంలో యల్లాల చినవెంకటరెడ్డి–పుల్లమ్మ జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు శుక్రవారం వితరణ చేశారు. రూ.25 వేల విలువ చేసే కుర్చీలను ఉదయగిరి డిపో ఇన్‌చార్జి మేనేజర్ శివకేశవ యాదవ్ సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ధరణి సేవా సమితి నిర్వాహకుడు యల్లాల రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రజారవాణా శాఖ నెల్లూరు రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి వినతి మేరకు కుర్చీలను వితరణ చేసినట్లు తెలిపారు. అసిస్టెంట్ ఇంజినీర్ సుభాషిణి, యల్లాల రమణారెడ్డి, తిప్పిరెడ్డి రమేష్, రేవునూరి శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

సీతారామపురం : అయ్యవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కావలి డీఎల్‌సీఓ రాజశేఖర్ మాట్లాడుతూ అంతర్జాతీయ కోఆపరేటివ్ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ నెల 6న నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు వివరించారు. ఎంఈఓ మస్తాన్‌వలి, హెచ్ఎం షఫీఅహ్మద్, ఉదయగిరి డీఎల్‌సీఓ శ్రీనివాసులురెడ్డి, సొసైటీ సీఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజానాయబ్‌రసూల్ వారి దర్గాలో ఈ నెల 18 నుంచి జరగనున్న గంధోత్సవానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆత్మకూరు ఆర్డీఓ పావని అన్నారు. శుక్రవారం ఏఎస్‌పేట దర్గాను ఆర్డీఓ సందర్శించారు. అనంతరం వీధుల్లో తిరుగుతూ పారిశుధ్యాన్ని, దుకాణాలను పరిశీలించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గంధోత్సవ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో గంధోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ అనిల్‌కుమార్, సీఐ వేమారెడ్డి, దర్గా ఈఓ హుస్సేన్, జిలానీ, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



దర్గా పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ పావని

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కావలి (జలదంకి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన కావలి మండలం ఆనెమడుగు పంచాయతీ పరిధిలోని బైనేటివారిపాళెంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. బైనేటివారిపాళెంలోని పరుసు వేణుకు చెందిన పూరింట్లో పరుసు రాఘవులు, రమ దంపతులు ఉంటున్నారు. వారికి నలుగురు కుమార్తెలు. గురువారం రాత్రి రాఘవులు తన కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. రాఘవులు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి నుంచి బయటకు పరిగెత్తారు. స్థానికుల సమాచారం కావలి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రితో పాటు రూ.30 వేల నగదు కాలిపోయాయి. సుమారు రూ.50 వేలకుపైగా నష్టం జరిగినట్లుగా బాధితుడు వాపోయాడు.



ఆదర్శ పాఠశాల తనిఖీ

సీతారామపురం : స్థానిక ఆదర్శ పాఠశాలను ఎంఈఓ మస్తాన్‌వలి శుక్రవారం తనిఖీ చేశారు. ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా చేపడుతున్న డిజిటల్ విద్యాబోధన తీరును పరిశీలించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ సమీరారెడ్డి, సీఆర్పీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మెగా లోక్ అదాలత్

కావలి (జలదంకి): కావలిలోని కోర్టుల ప్రాంగణంలో న్యాయమూర్తుల ఆధ్వర్యంలో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించనున్నట్లు లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి శుక్రవారం తెలిపారు. కక్షిదారులు రాజీపడి వస్తే లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కావలితో పాటు కొండాపురం, జలదంకి, కలిగిరి, బోగోలు మండలాల కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

15 నుంచి రైతులకు యూరియా పంపిణీ

ఉదయగిరి: మండలంలోని బండగానిపల్లె రైతు సేవా కేంద్రంలో ఈ నెల 15వ తేదీ నుంచి రైతులకు యూరియా పంపిణీ చేయనున్నట్లు ఏడీఏ చెన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని యూరియా సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించి 18 టన్నుల యూరియాను సరఫరా చేయడం జరిగిందన్నారు. బండగానిపల్లి, జీ చెరువుపల్లి రైతుసేవా కేంద్రాల పరిధిలోని రైతులకు యూరియాను పంపిణీ చేస్తామని తెలిపారు. త్వరలో మరో 18 టన్నుల యూరియా తిరుమలాపురం రైతుసేవా కేంద్రానికి వస్తుందన్నారు. జామాయిల్, గడ్డి జొన్న సాగు చేసిన రైతులకు యూరియా పంపిణీ చేయమని తెలిపారు. రైతులు సహకరించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేత్రదానం

కావలి (జలదంకి) : కావలి మండలం గౌరవరానికి చెందిన ముమ్మడిసింగు మల్లేశ్వరమ్మ (72) శుక్రవారం మృతి చెందగా నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త దిరిశల శివశంకర్‌రెడ్డి సహకారంతో నెల్లూరు ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ నేత్రాలను సేకరించారు.

17న మెగా రక్తదాన శిబిరం

జలదంకి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఈ నెల 17న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జలదంకి రెడ్‌క్రాస్ అధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కావలి రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో రక్తదాతలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం

కావలి (జలదంకి): పట్టణంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ట్రస్టీ మేనేజర్ చాగణం గౌరీశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు అందజేస్తామన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి తిరుపతిలోని ఆస్పత్రిలో చేస్తారని తెలిపారు. పట్టణ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.330

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్టంగా రూ.330 ధర పలికింది. వేలానికి 997 బేళ్లు రాగా, అందులో 640 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.330, కనిష్టంగా రూ.100, సగటున రూ.208.34 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్టంగా రూ.330 ధర పలికింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 589 బేళ్లను తీసుకురాగా, 341 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.320, కనిష్టంగా రూ.110, సగటున రూ. 256.62 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

అనారోగ్య బాధితుడికి సాయం

సీతారామపురం : స్థానిక సినిమాహాలు సెంటర్ ప్రాంతానికి చెందిన ఎడమకంటి సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో బాధపడుతుండగా జనసేన నాయకుడు భోగినేని కాశీరావు శుక్రవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సుబ్రహ్మణ్యం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

సంగం: దువ్వూరు వద్ద బైక్‌ను లారీ ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. వంగల్లు గ్రామానికి చెందిన వేణు బుచ్చిరెడ్డిపాళెం నుంచి వంగల్లుకు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా దువ్వూరు వద్ద లారీ ఢీకొంది. ఈ ఘటనలో వేణు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. కాగా ఢీకొట్టిన లారీ ఆగకుండా వెళ్లిపోతుండగా బుచ్చిరెడ్డిపాళెం టోల్‌గేట్ వద్ద సంగం పోలీసులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై సంగం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

గ్రామ సచివాలయం తనిఖీ



సీతారామపురం : బాలాయపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ సాయిప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయాన్ని పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్, వర్క్‌ఫ్రమ్ హోం, సిటిజన్ ఈకేవైసీ సర్వేలపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేసి ప్రజా సమస్యల నమోదుకు ప్రత్యేక రిజిస్టర్‌ను కేటాయించాలని సూచించారు.

మర్రిగుంట తలారి మృతి

కొండాపురం: మర్రిగుంట పంచాయతీ తలారి లక్ష్మీనారాయణ(27) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం తలారి మృతదేహాన్ని రెవెన్యూ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

కలిగిరి: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్257 నాయకులు మండల తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ గిరీష్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ 257 నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాల సవరణ, కరువు భత్యం మంజూరు చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా సమస్యలను పరిష్కరించకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు. యాప్‌లను, అసెస్మెంట్ బుక్‌లెట్లను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. అన్ని రకాల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.



ఇన్‌చార్జ్ తహసీల్దార్ గిరీష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ 257 నాయకులు

ఘనంగా విశ్వనాథ జయంతి వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలోని మేధా పాఠశాలలో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రామాయణ కల్పవృక్షం, వేయిపడగలు వంటి రచనల ద్వారా విశ్వనాథ సత్యనారాయణ తెలుగుభాష ఔన్నత్యానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తన రచనలకు గానూ ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ పురస్కారాన్ని సైతం అందుకున్నారని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు పుస్తకాలను బహుమతులుగా ప్రదానం చేశారు. తొలుత విశ్వనాథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా సమితి కార్యవర్గ సభ్యులు సోమవరపు యానాదిరెడ్డి, ఎస్వీ చలమయ్య, కొల్లా వెంకటేశ్వర్లు, ఎస్‌వీ రమణయ్య, గోవిందరెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, డీ రాఘవేంద్రరావు, పాఠశాల కరస్పాండెంట్ పీసీవీ సుబ్బయ్య పాల్గొన్నారు.



వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

వాటర్ ట్యాంకు నిర్మాణంపై వివాదం

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో నూతన వాటర్ ట్యాంకు నిర్మాణం విషయంలో శుక్రవారం వివాదం తలెత్తింది. గ్రామానికి చెందిన యర్రగుంట నాగభూషణమ్మ, తదితరులు తమ స్థలంలోకి వెళ్లేందుకు దారిగా వినియోగించుకుంటున్న భూమిలో వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టడం తగదని అడ్డుకున్నారు. అయితే మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి జునైద్ అహమ్మద్ ఘటనా స్థలానికి చేరుకుని సదరు స్థలం ప్రభుత్వ భూమిగా ఉందని, ప్రజా ప్రయోజనాల కోసం వాటర్ ట్యాంకు నిర్మాణం చేపడుతున్నామని పేర్కొనడంతో స్వల్ప ఉద్రిక్తత తలెత్తింది. ఆత్మకూరు ఎస్సై జిలానీబాషా తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వాటర్ ట్యాంకు నిర్మాణానికి సంబంధించిన పనులు పూర్తి చేయించారు. దీంతో బాధితురాలు ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావనికి తన బంధువులతో కలిసి వెళ్లి ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారించి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు.



పోలీసుల పర్యవేక్షణలో వాటర్ ట్యాంకు పనులు చేపడుతున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి (జలదంకి): కావలిలోని పలు ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లు, మరమ్మతుల చేపడుతున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు కావలి ట్రాన్స్‌కో ఏఈ వసంతరావు శుక్రవారం తెలిపారు. వెంగళరావునగర్, ఇందిరా నగర్, బాలకృష్ణారెడ్డినగర్, తుఫాన్‌నగర్, జనతాపేట సౌత్, మున్సిపల్ ప్లాట్స్, వైకుంఠపురం, పెంకుల ఫ్యాక్టరీ, తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు వివరించారు.

ఉదయగిరి: పట్టణంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయగిరి, వరికుంటపాడు, గండిపాళెం, కుర్రప్రల్లి, పెద్దిరెడ్డిపల్లి, సీతారామపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ ఖుద్దూస్‌బాషా శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వర్షానికి నేలవాలిన వరి

ఆత్మకూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ఎడగారు పంట నేలవాలింది. మహిమలూరు, కోటపాడు, నాగులపాడు, చెర్లోయడవల్లి, బోయలచిరివెళ్ల, నారంపేట, తదితర గ్రామాల్లోని సుమారు 200 ఎకరాల్లోని వెన్నుదశలోని పంట తడిచిపోయి నేలపాలవడంతో అన్నదాతలు తల్లడిల్లుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



కోటపాడులో నేల వాలిన వరి

పనిభారం నుంచి విముక్తి కల్పించాలని వినతి

సీతారామపురం : పనిభారం నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ సచివాలయ సిబ్బంది ఎంపీడీఓ సాయిప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటి సర్వేల నుంచి విముక్తి కలిగించాలని, సమయపాలనకు సంబంధించిన నిబంధనలు సడలించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లతో పాటు ఆరేళ్లుగా ఒకే కేడర్లో పనిచేసిన వారికి ప్రత్యేక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలవుతున్న రికార్డ్ అసిస్టెంట్ కేడర్‌ను జూనియర్ అసిస్టెంట్‌గా మార్పు చేయాలన్నారు. సెలవు దినాల్లో విధులు నిర్వర్తించాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలకు పదిహేను రోజుల్లో పరిష్కారం చూపకపోతే దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

శ్మశాన స్థలాన్ని వదల్లేదు



శ్మశాన స్థలాన్ని ఆక్రమించి గేటు ఏర్పాటు చేసిన దృశ్యం

ఉదయగిరి : దుత్తలూరు మండలం నందిపాడు పంచాయతీ పరిధిలోని శ్రీరామనగర్‌లోని విలువైన శ్మశాన స్థలం ఆక్రమణకు గురైంది. నందిపాడు–దుత్తలూరు జాతీయ రహదారి పక్కనే ఉన్న రూ.కోట్ల విలువ చేసే ఈ స్థలాన్ని అధికార పార్టీ నేత అండదండలతో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు దర్జాగా ఆక్రమించి సాగుచేస్తున్నాడు. పాపంపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 313, 314, 315, 316లోని కొన్ని భిన్నాల్లో కొంత ప్రభుత్వ భూమి, శ్మశాన స్థలం ఉంది. ఈ మొత్తం భూమిని ఉపాధి క్షేత్రసహాయకుడు ఆక్రమించి సాగుచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు క్షేత్రసహాయకుడు తన పట్టా పొలాన్ని వైఎస్సార్ జిల్లాకు చెందిన వారికి లీజుకు ఇచ్చి దాని పక్కనే ఉన్న శ్మశాన భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోడం లేదని స్థానికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి శ్మశాన భూమిని ఆక్రమణదారుల చెర నుంచి విడిపించాలని వారు కోరుతున్నారు.